క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

దేవరకొండ: దేవరకొండ మండల పరిధిలోని కొమ్మేపల్లి గ్రామానికి చెందిన సలీం ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చుల నిమిత్తం దేవరకొండకు చెందిన హెల్పింగ్ హాండ్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం హైదరాబాద్‌లో కుటుంబసభ్యులకు రూ.15వేలు ఆర్థికసాయం అందజేశారు. వారిలో అసోసియేషన్ సభ్యులు అన్వేష్‌రెడ్డి, ఏలే రిషి, తదితరులున్నారు.

బీఆర్‌ఎస్ కార్యకర్తకు పరామర్శ



జటావత్ చందును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

హాలియా: మున్సిపాలిటీలోని 11వ వార్డులో నివాసం ఉంటున్న పెద్దవూర మండలంలోని చింతపల్లితండాకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త జటావత్ చందు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఆదివారం బాధితుడి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట పెద్దవూర మండల అధ్యక్షుడు జటావత్ రవినాయక్, నాయకులు కుంటిగొర్ల రవి, జానపాటి యల్లయ్య తదితరులున్నారు.

డిప్యుటేషన్ల రద్దుతో పీహెచ్‌సీ కళకళ

గుర్రంపోడు: వైద్య ఆరోగ్యశాఖలో డిప్యుటేషన్ల రద్దుతో ఇక్కడి నుంచి డిప్యూటేషన్‌పై వెళ్లిన ఉద్యోగులు తిరిగి వచ్చారు. దీంతో పీహెచ్‌సీకి కొత్త కళ వచ్చింది. గుర్రంపోడు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో డిప్యుటేషన్‌పై వెళ్లిన వైద్యాధికారి జమీర్‌తోపాటు సీహెచ్‌ఓ వెంకట్‌రెడ్డి, సీహెచ్‌ఎస్ శారదాకుమారి, సూపర్‌వైజర్ ఉపేందర్, ఫార్మసిస్టు భాగ్యమ్మ, అటెండర్‌లు మళ్లీ ఇక్కడ విధుల్లో చేరారు. నల్లగొండలోని టీ హబ్‌కు డిప్యుటేషన్‌పై వెళ్లిన ల్యాబ్ టెక్నీషియన్ సుజీత్ మాత్రం ఇంకా విధుల్లో చేరలేదు. డిప్యుటేషన్ల రద్దు అనంతరం విధుల్లో చేరికలపై ఉన్నతాధికారులు అడగటంతో ల్యాబ్ టెక్నీషియన్ తిరిగి రాని విషయాన్ని నివేదించామని వైద్యాధికారి డాక్టర్ భవానీ చక్రవర్తి తెలిపారు.

హౌజింగ్‌బోర్డులో ఉచిత వైద్య శిబిరం



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ శ్రీమన్నారాయణ

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని హౌజింగ్ బోర్డులో గల నవజ్యోతి స్కూల్‌లో జన విజ్ఞాన వేదిక మిర్యాలగూడ ఆధ్వర్యంలో ఆదివారం ప్రముఖ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ గోపాలం శ్రీమన్నారాయణ, డాక్టర్ కొమలి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 280 మందికి ఫిట్స్, బీపీ, షుగర్, పక్షవాతం పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తిరిగి జూన్ 16న వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు జేవీవీ ప్రతినిధులు రమణారెడ్డి, అమరయ్య తెలిపారు. కార్యక్రమంలో వలంటీర్లు రంగారెడ్డి, అక్కయ్య బాబు, శ్రీనివాస్, శోభ, వేదశ్రీ, వెంకటేశ్వర్లు, కృష్ణారావు, వెంకటరమణారెడ్డి, కోటిరెడ్డి తదితరులున్నారు.

చిత్రలేఖనం పోటీలో విద్యార్థిని ప్రతిభ



ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థిని

మిర్యాలగూడ టౌన్: ఖమ్మంలోని గత నెల జనవరి 28న ఎస్‌బీఐటీ కళాశాలలో బ్రిలియంట్ ఒలింపియాడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో మిర్యాలగూడ పట్టణంలోని సాయిగీత స్కూల్ విద్యార్థిని రమ్యశ్రీ జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఈమేరకు ఈనెల 17న ఖమ్మంలో గల భక్తరామదాసు కళాక్షేత్రంలో ఆ సంస్థ డైరెక్టర్ అంతోటి రామకృష్ణ చేతుల మీదుగా విద్యార్థిని అవార్డుతో పాటు ప్రశంసా పత్రం అందుకుంది. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గుంటూరు వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ గుంటూరు గీత విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో 'న్యూట్రి గార్డెన్లు'

- చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు కూరగాయల సాగు
- మొత్తం 52 అంగన్‌వాడీల్లో నిర్వహణ



మిర్యాలగూడ మండలంలోని సుబ్బారెడ్డిగూడెంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో న్యూట్రీషన్ గార్డెన్

మిర్యాలగూడ టౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించేందుకు 2020లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆకు కూరల సాగుకు శ్రీకారం చుట్టింది. సొంత భవనాలు ఉన్న కేంద్రాల్లో ఏర్పాటు చేసిన న్యూట్రీషన్ గార్డెన్లు సత్ఫలితాలు ఇస్తున్నాయి. ఫలితంగా ఆయా కేంద్రాల్లో పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందుతుంది.

ప్రత్యేక నిధులు లేకపోయినా..

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు విత్తనాలను మార్కెట్లో కొనుగోలు చేసి సాగు చేస్తున్నారు. వీటికి ప్రత్యేక నిధులు వంటివి ఏమిలేవు. అంగన్‌వాడీ కేంద్రాల్లో టమాటా, బీర, బెండ, వంకాయ, సొరకాయ, మెంతికూర, పాలకూర, బచ్చలకూర, తోటకూర, కొత్తిమీర, కరివేపాకు, నిమ్మ, అల్లనేరేడు, బొప్పాయి, ఉసిరి వంటి తదితర పంటలను సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్నారు.

52 కేంద్రాల్లో సాగు..

మిర్యాలగూడ అర్బన్, దామరచర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 462 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వీటి పరిధిలో 52 కేంద్రాల్లో న్యూట్రీ షన్ గార్డెన్లు నిర్వహిస్తున్నారు. ఈ కూరగాయల సాగుకు సేంద్రియ ఎరువులను వినియోగిస్తున్నారు. మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్టు పరిధిలో 6633 మంది పిల్లలు ఉండగా గర్భిణులు, బాలింతలు మొత్తం 1730 మంది ఉన్నారు. అదే విధంగా దామరచర్ల ప్రాజెక్టు పరిధిలోని దామరచర్ల, మాడుగులపల్లి, అడవిదేవులపల్లి, వేములపల్లి, త్రిపురారం మండలాల్లో చిన్నారులు 9013 మంది ఉండగా గర్భిణులు, బాలింతలు 1854 మంది ఉన్నారు.



పొట్టిగానితండాలో కూరగాయల మొక్కలను పరిశీలిస్తున్న అంగన్‌వాడీ టీచర్

మండలం	కేంద్రాలు	న్యూట్రీగార్డెన్లు
అడవిదేవులపల్లి	32	05
దామరచర్ల	79	10
వేములపల్లి	25	05
మాడుగులపల్లి	48	08
త్రిపురారం	67	10
మిర్యాలగూడ అర్బన్	211	14

విత్తనాలు సరఫరా చేస్తే ఎంతో మేలు



అంగన్‌వాడీ భవనం పక్కన్న ఉన్న స్థలంలో కూరగాయలను సాగు చేస్తున్నాం. మొదట్లో విత్తన సంస్థ ద్వారా అందజేయగా ప్రస్తుతం నిర్వాహకులే మార్కెట్లో కొనుగోలు చేయాల్సి వస్తుంది. ప్రభుత్వం విత్తనాలను సరఫరా చేస్తే బాగుంటుంది.

– అంజమ్మ, అంగన్‌వాడీ టీచర్, సుబ్బారెడ్డిగూడెం, మిర్యాలగూడ

ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం



ప్రస్తుతం సొంత భవనాలు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు అద్దె భవనాలు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో కొంత మేరకు ఖాళీ స్థలాలు ఉంటే న్యూట్రీ గార్డెన్లు ఏర్పాటు చేసుకోవాలని చెప్పాం. న్యూట్రీ గార్డెన్లను సూపర్‌వైజర్లు, నేను అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లిన సమయంలో పరిశీలిస్తాం.

– మమత, సీడీపీఓ, మిర్యాలగూడ ఐసీడీఎస్ ప్రాజెక్టు

మంచి ఫలితాలు సాధిస్తున్నాం



దామరచర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని వేములపల్లి, మాడుగులపల్లి, అడవిదేవులపల్లి, దామరచర్ల మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన న్యూట్రీ గార్డెన్లతో మంచి ఫలితాలు సాధిస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉంటే సిబ్బంది ఇంటి ఆవరణలో సాగు చేసుకోవచ్చు.

– చంద్రకళ, సీడీపీఓ, దామరచర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



వైద్య పరీక్ష చేయించుకుంటున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని నందిపాడులో గల ప్రభుత్వ పాఠశాలలో కప్పల మట్టమ్మ జ్ఞాపకార్థం సనత్ గౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ స్టార్ ఆస్పత్రి నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గాయం ఉపేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాదిల శ్రీనివాస్, కౌన్సిలర్ కొమ్ము శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ తూడి అశోక్‌రెడ్డి, నాయకులు జొన్నలగడ్డ శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, దుర్గాప్రసాద్, రామకృష్ణారెడ్డి, నాగిరెడ్డి, ఇమ్రాన్ తదితరులున్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తా

- ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

పెద్దఅడిశర్లపల్లి: నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. ఆదివారం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని బాలాజీనగర్ శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దైవచింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ అలుగుబెల్లి శోభారాణిఏవిరెడ్డి, దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, పీఏసీఎస్ చైర్మన్లు జాల నర్సింహారెడ్డి, వేణుధర్‌రెడ్డి, మణిపాల్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ అర్వపల్లి సరితానర్సింహ, కాంగ్రెస్ నాయకులు సిరాజ్‌ఖాన్, కుక్కల గోవర్ధన్‌రెడ్డి, ఎల్లయ్య, సతీష్‌రెడ్డి, చందూనాయక్, వెంకట్‌రెడ్డి, రామచంద్రూనాయక్, ఆలయ కమిటీ చైర్మన్ బన్సీలాల్, శ్రీరాంనాయక్, సంగూనాయక్, వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

భాగ్యరెడ్డి వర్మ వర్ధంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

దేవరకొండ: దేవరకొండ పట్టణంలోని అంబేద్కర్ గ్రంథాలయంలో ఆదివారం మాల మహానాడు ఆధ్వర్యంలో సంఘ సంస్కర్త, దళిత ఉద్యమ తొలిపొద్దు భాగ్యరెడ్డి వర్మ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి భాగ్యరెడ్డి వర్మ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు నూనె విష్ణు, ఏకుల సురేష్, బోయిని చంద్రమౌళి, మేడ సైదులు, నూనె సురేష్, రవి, చెన్నయ్య, వర్మ, భాస్కర్ తదితరులున్నారు.

యువజన సంఘాన్ని బలోపేతం చేయాలి



నూతన కార్యవర్గానికి నియామకపత్రం అందజేస్తున్న దైద సత్యం

మిర్యాలగూడ టౌన్: అంబేద్కర్ యువజన సంఘం బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నేత, అంబేద్కర్ యువజన సంఘం స్టీరింగ్ కమిటీ సభ్యుడు దైద సత్యం మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం మిర్యాలగూడలోని గాంధీ పార్క్ పాఠశాలలో నిర్వహించిన అంబేద్కర్ యువజన సంఘం పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన కమిటీ సమన్వయంతో పనిచేసి సంఘం బలోపేతంపై దృష్టి సారించాలన్నారు. అనంతరం సంఘం జిల్లా కన్వీనర్ కొండేటి వెంకట్ ఆదేశాల మేరకు నూతన కార్యవర్గాన్ని ప్రకటించి నియామకపత్రాలు అందజేశారు. ముందుగా బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

పట్టణ కార్యవర్గం ఎన్నిక..

అంబేద్కర్ యువజన సంఘం పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొడిరెక్క మట్టయ్య, అధ్యక్షుడిగా దైద శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఉబ్బపల్లి భాస్కర్, వి.నాగేందర్, జొన్నపాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా శ్రీరామ్ నాగయ్య, అడిషనల్ ప్రధాన కార్యదర్శి పోలేపాక సురేందర్, కార్యదర్శులుగా మత్రి జోజి, అశోక్‌రాథోడ్, గోళ్ల సుమన్, ఉబ్బపల్లి సైదులు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా వట్టిపు సుధీర్, పందిరి పరశురాములు, జన్నపాల కిరణ్. సురేష్, కోశాధికారిగా అవిరెండ్ల సందీఫ్, గేమ్స్ కార్యదర్శిగా కేసారపు శంకర్, సాంస్కృతిక కార్యదర్శిగా కొడిరెక్క చంటి, సోషల్ మీడియా కన్వీనర్లుగా దైద శరత్, పరంగి వెంకట్, కార్యవర్గ సభ్యులుగా జిల్లా రమేష్, ఉబ్బపల్లి రాఘవేంద్ర, దైద నాగరాజు, అవినాష్, రోహిద్, మోహన్, రవి, వెంకన్నను ప్రకటించారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం పట్టణ స్టీరింగ్ కమిటీ సభ్యులు కత్తుల సూర్యనారాయణ, ఉబ్బపల్లి కాశయ్య, కోట విజయ్‌తో పాటు పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపాలు ఏర్పాటు చేయాలని వినతి



మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంఘం నాయకులు

మిర్యాలగూడ టౌన్: నియోజకవర్గంలో పేద యువతీ, యువకుల వివాహం కోసం కల్యాణ మండపాలు ఏర్పాటు చేయడంతో పాటు బీసీ భవనాలు ప్రారంభించాలని తెలంగాణ యువజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుంకు శ్రీనివాస్ కోరారు. ఈమేరకు ఆదివారం మిర్యాలగూడలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కల్యాణ మండపాలు లేకపోవడంతో పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ భవనం వెనుక భాగంలో నిరుపయోగంగా ఉన్న రేకుల షెడ్డును బీసీలకు కేటాయించి, అందులో కల్యాణ మండపం ఏర్పాటు చేయాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో సంఘం నాయకులు మురళీయాదవ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గాయం ఉపేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాదిల శ్రీనివాస్, బీసీ సంఘం నాయకురాలు బంటు కవిత, బాసిద్, తయ్యబ్, సుధాకర్ తదితరులున్నారు.

ప్రజా ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం



సబ్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

త్రిపురారం: ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని ఎంపీపీ అనుముల పాండమ్మ అన్నారు. త్రిపురారం మండలంలోని పెద్దదేవులపల్లిలో ఆదివారం జెడ్పీటీసీ భారతితో కలిసి పీహెచ్‌సీ సబ్ సెంటర్ నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేసి మాట్లాడారు. పేదలకు స్థానికంగా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ ఆస్పత్రులను ప్రభుత్వం బలోపేతం చేస్తోందని తెలిపారు. సర్కారు ఆస్పత్రుల్లోనే మెరుగైన వైద్యం సాధ్యమని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాములు, అనుముల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కోటేష్ యాదవ్, బుచ్చిరెడ్డి, నరేందర్, భాస్కర్ నాయక్, రవికుమార్, సైదులు పాల్గొన్నారు.

జాబ్ మేళాను విజయవంతం చేయాలి

హాలియా: హాలియా పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఈనెల 20న ఏకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాకు నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులు హాజరై విజయవంతం చేయాలని ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కట్టెబోయిన అనిల్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. నాగార్జునసాగర్ నియోజకవర్గ నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ఏకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, బీఫార్మసీ, ఎంఎస్సీ, డిప్లొమా, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు తమ వెంట ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెస్యూమ్ 3 సెట్లు, ఆధార్‌కార్డు 3 సెట్ల జిరాక్స్‌లను తీసుకురావాలని పేర్కొన్నారు.

అనుమానాస్పద వ్యక్తి పోలీసులకు అప్పగింత

నల్లగొండ క్రైం : బిహార్‌కు చెందిన వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో ఆదివారం నల్లగొండ పట్టణంలోని సుందరయ్య కాలనీకి చెందిన ప్రజలు పట్టుకుని నల్లగొండ రూరల్ పోలీసులకు అప్పగించారు.. వివరాలు సుందరయ్య కాలనీలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా ప్రధాన రోడ్డుపై వెళ్తుండగా కాలనీ వాసులు పట్టుకుని 100 నంబర్‌కు ఫోన్ చేసి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన పోలీసులు అతడిని రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించారు. బిహార్ నుంచి ఉపాధి కోసం వచ్చానని తెలుగు సరిగా రాదని ఆ వ్యక్తి పోలీసులకు తెలిపాడు. అతడి వద్ద మొబైల్ ఫోన్ కూడా లేదని, ఉపాధి కోసం వచ్చాడని, పిల్లల్ని పట్టుకుపోయే వ్యక్తిగా సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం జరుగుతోందని ఎస్‌ఐ శివకుమార్ పేర్కొన్నారు.

పరీక్షలంటే ఆందోళన చెందొద్దు



దేవరకొండ: టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు



హాలియా : ప్రశ్నపత్రాలను విడుదల చేస్తున్న ఎస్‌ఐ సతీష్‌రెడ్డి, హెచ్‌ఎం కృష్ణమూర్తి



కొండమల్లేపల్లి: టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు

హాలియా : విద్యార్థులు పరీక్షలంటే ఆందోళన చెందొద్దని, ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ఎస్‌ఐ సతీష్‌రెడ్డి, హాలియా హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు గుండా కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం హాలియా జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి టాలెంట్ టెస్టు నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్‌ఐ హాజరై జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. విద్యార్థుల్లో ప్రతిభ వెలికి తీయడానికే ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్‌లు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు నిలవాలంటే కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాగార్జున సాగర్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లబెల్లి జగదీష్, కోరే రమేష్, పెద్దవూర మండల కార్యదర్శి సాయి, అనుముల మండల అధ్యక్షుడు దోసపాటి నవీన్, కడారి నాగరాజు, షేక్ జానీ తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకే..

దేవరకొండ: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు టాలెంట్ టెస్ట్‌లు దోహదపడుతాయని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి బుడిగ వెంకటేష్ అన్నారు. ఆదివారం దేవరకొండ పట్టణంలో పదో తరగతి విద్యార్థులకు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి లోను కాకూడదన్నారు. పరీక్షా సమయంలో టాలెంట్ టెస్ట్‌లు నిర్వహించడం ద్వారా వారిలో ఉన్న భయాన్ని తొలగించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులున్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు ఆదివారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమావత్ లక్ష్మణ్‌నాయక్ ప్రశ్నపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు బుడిగ వెంకటేశ్, స్పందన, అంజలి, అంకిత, రాము, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పరీక్షలు సద్వినియోగం చేసుకోవాలి

18ఎంఎల్‌జీ 51 మిర్యాలగూడలోని బకల్‌వాడీ ప్రభుత్వ పాఠశాలలో టాలెంట్ టెస్ట్ పరీక్షల ప్రశ్నపత్రాలు విడుదల చేస్తున్న టూ టౌన్ ఎస్‌ఐ కృష్ణయ్య


మిర్యాలగూడ అర్బన్: పదో తరగతి పరీక్షలపై విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పోగొట్టేందుకు టాలెంట్ టెస్ట్‌లు ఎంతో ఉపయోగపడతాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మిర్యాలగూడ టూ టౌన్ ఎస్‌ఐ కృష్ణయ్య, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ డబ్బికార్ మల్లేష్ అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని బకల్‌వాడీ పాఠశాలలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్ ప్రశ్నపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో కేఎల్‌ఎన్ విద్యాసంస్థల కరస్పాండెంట్ కిరణ్, జిల్లా ఎస్‌ఎఫ్‌ఐ ఉపాధ్యక్షుడు కుర్ర సైదానాయక్, యూటీఎఫ్ మండల నాయకుల శ్రీనివాసులురాజు, ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ నాయకులు సుమన్, ప్రసన్న, నాగపుష్ప, అఖిల్, అనిల్, సాయి, సమీర్, రవి, జగదీష్, యశ్వంత్, రాకీ తదితరులున్నారు.

దామరచర్లలో...

దామరచర్ల మండల ఎస్‌ఎఫ్‌ఐ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పరీక్ష ప్రశ్నపత్రాలను వాడపల్లి ఎస్‌ఐ ఇరుగు రవికుమార్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ దామరచర్ల మండల కార్యదర్శి వీరన్న, మాజీ నాయకులు శ్రీనునాయక్, డీవైఎఫ్‌ఐ, సీపీఎం నాయకులు వినోద్ నాయక్, పాపానాయక్, దయానంద్, బాలు, చంద్రశేఖర్, జాన్, సత్యనారాయణ, సందీఫ్, పవన్, నర్సింహ, రాజశేఖర్ తదితరులున్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవ కరపత్రాల ఆవిష్కరణ

హాలియా: పట్టణంలోని సాగర్ ఎడమ కాల్వ సమీపంలో ఉన్న గోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి శివ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో ఈనెల 20న స్వామి వారి కల్యాణం మహోత్సవం నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈమేరకు ఆదివారం దేవాలయంలో కమిటీ సభ్యులు బ్రహ్మోత్సవాల కరపత్రాల ఆవిష్కరించి మాట్లాడారు. ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ గొట్టిముక్కల నర్సింహాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, మండపారాధన, విఘ్నేశ్వర పూజ, పూర్ణాహుతి, అభిషేకం, రుద్రాభిషేకం, హోమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ చెన్నోజు మోహనాచారి, ఉపాధ్యక్షులు నారోజు సత్తయ్యాచారి, కలకుంట్ల కోటాచారి, మేలోజు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శులు బొడ్డుపల్లి శంకరాచారి, చేపూరి కొండలాచారి, వెంకటాచారి, మేలోజు ఆంజనేయచారి, బొడ్డుపల్లి వెంకటాచారి, యల్లయ్యాచారి, కటకం మురళిచారి, శివకుమార్ చారి, శ్రీనివాసాచారి, బ్రహ్మచారి, వెంకన్న, రవిచారి, పురుషోత్తంచారి, నారాయణ చారి, రాంచందర్, శంబయ్యాచారి, సాగర్ చారి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సభ్యులు

ఉత్సవాలకు ఆలయం ముస్తాబు



ముస్తాబు చేసిన ఆలయం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

- శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పది రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు

హాలియా: అనుముల మండలంలోని మారెపల్లి గ్రామంలో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. పది రోజుల పాటు బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఎంఏ హరుణ్ అంజద్, వైస్ ఎంపీపీ మాలే అరుణ సత్యనారాయణరెడ్డి, దేవస్థాన ఈఓ నాగిరెడ్డి, చైర్మన్ మట్టపల్లి వెంకన్న వెంకటేశ్వర్లు బ్రహ్మోత్సవ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి మంగళ శాసనాల ఆధ్వర్యంలో ఈనెల 19 నుంచి 28వ తేదీ వరకు తిరుకల్యాణం, రథోత్సవం, హోమం, బలిహరణం, విష్ణు సహస్రనామం, దోపోత్సవం, అశ్వవాహన సేవ, పూర్ణాహుతి, నవకళశాభిషేకం, చక్రతీర్థం, విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశనం, దీక్షాస్వీకారం, అంకురార్పణ, వాస్తుహోమం, గరుడ హోమం, ధ్వజపటాధివాసం, ధ్వజారోహణం, గరుడముద్ద, మహాపూర్ణాహుతి వంటి పూజలు నిర్వహించనున్నారు. అనంతరం అలివేలుమంగ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ బరపటి సరితశ్రీను, అనుముల యాదయ్య, ముత్తయ్య, ఏడుకొండలు, ఈదయ్య, హనుమంతు, వినయ్, నగేష్, నాగరాజు, మల్లేష్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

చందంపేట: అక్రమంగా తరలిస్తున్న 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆదివారం జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. చందంపేట మండలంలోని గుంటిపల్లి గ్రామ శివారులో నిర్వహించిన వాహన తనిఖీల్లో బొలేరో వాహనాన్ని తనిఖీ చేయగా 25 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు డీటీసీఎస్ హనుమంతు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. పట్టుబడిన వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. తనిఖీల్లో దేవరకొండ, మిర్యాలగూడ, నల్లగొండ, పెద్దవూర, నాంపల్లి డీటీసీఎస్‌లు హన్మంతు శ్రీనివాస్‌గౌడ్, ఎండీ జావెద్, లింగస్వామి, ఎండీ ముక్తార్, హబీబ్ పాల్గొన్నారు.